సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 16 । మే । 2025



టన్ను చీనీ రూ.32 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు, కనిష్టం రూ.4,250 ప్రకారం ధర పలికాయి.



రోగులకు మెరుగైన వైద్య సేవలు
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నట్లు డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్ తెలిపారు.
8లో

గరిష్టం/కనిష్టం
37.4°/20.9°

వర్షప్రభావంతో జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవి తాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

21న జెడ్పీ సర్వసభ్య సమావేశం



అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు అనంతపురంలోని జిల్లా పరిషత్ సమావేశ ప్రధాన మందిరంలో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని వెల్లడించారు. సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి చర్చను ప్రారంభిస్తారని, గత సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలకు సంబంధించి అధికారులు ఏం చర్యలు తీసుకున్నారో సమగ్ర వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సహా జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు హాజరయ్యే సమావేశానికి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని స్పష్టం చేశారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారా లీగల్ వలంటీర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. హిందూపురం ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, హిజ్రాలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పదో తరగతి లేదా అందుకు సమానమైన విద్యార్హత కల్గి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను హిందూపురం జిల్లా అదనపు జడ్జి న్యాయ సముదాయంలో ఉన్న లోక్ అదాలత్ విభాగంలో అందజేయాలని తెలియజేశారు.

పాలిసెట్‌లో 94.03 శాతం ఉత్తీర్ణత



మాట్లాడుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

ధర్మవరం అర్బన్: జిల్లాలో పాలిటెక్నిక్ డిప్లొమా ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్–2025లో జిల్లా వ్యాప్తంగా 94.03 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2,704 మంది బాలురు, 1,989 మంది బాలికలు మొత్తం 4,693 మంది పరీక్షలు రాశారన్నారు. వారిలో 2,510 మంది బాలురు, 1,903 మంది బాలికలు మొత్తం 4413 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బాలురు 92.83 శాతం, బాలికలు 95.68 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 94.03 శాతం ఉత్తీర్ణత సాధించడం హర్షణీయమన్నారు.

నేడు లేపాక్షి నంది పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ



లేపాక్షి: భారత తపాలాశాఖ హిందూపురం డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం స్థానిక చేతన కన్వెన్షన్‌హాల్‌లో లేపాక్షి ఆలయ నమూనాతో పోస్టు కార్డు విడుదల చేయనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ యూ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరభద్రస్వామి దేవస్థానంపై ప్రత్యేకంగా రూపొందించిన పిక్చర్ పోస్టుకార్డుతో పాటు లేపాక్షి నంది నమూనాతో పర్మనెంట్ పిక్టోరియల్ కాన్సిలేషన్ (పోస్టల్ మార్క్/స్టాంప్)ను ఆవిష్కరించన్నుట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్‌తో పాటు రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ వనం ఉపేంద్ర ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.



బత్తలపల్లి మండలం సంజీవపురంలో ఆలయం ముందు నిలిచిన వర్షపు నీరు



పుట్టపర్తి: మామిళ్లకుంట క్రాస్ వద్ద ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



వర్షపు నీటితో కనగానపల్లి మండలం కోనాపురం సమీపంలో పారుతున్న వాగు

జిల్లాలో విస్తారంగా వర్షాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం తెల్లవారు జామున 24 మండలాల్లో వర్షాలు కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా కనగానపల్లి మండలంలో 75.2 మి.మీటర్లు, ధర్మవరం 71.6, బుక్కపట్నం 46, తాడిమర్రి 41.2, బత్తలపల్లి 36.2, పుట్టపర్తి 33.2, చిలమత్తూరు 33.2, కొత్తచెరువు 27.6, గాండ్లపెంట 24.4, కదిరి 21.2, అమడగూరు మండలంలో 20.8 మి.మీటర్ల వర్షం కురిసింది. అలాగే ఓడీచెరువు మండలంలో 16.4, సీకేపల్లి 16.2, ముదిగుబ్బ 12.6, రామగిరి 11.8, తలుపుల 9.4, నల్లచెరువు 7.2, గోరంట్ల 5.4, తనకల్లు 4.8, నల్లమాడ 4.2, సోమందేపల్లి 3.8, పెనుకొండ 2.8, ఎన్‌పీ కుంట 2.4, రొద్దం మండలంలో 2 మి.మీటర్ల వర్షం కురిసింది. వర్షం రాకతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముంగారు సేద్యానికి ఎంతో ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

పచ్చ కుట్ర.. ప్రలోభ పాచిక

మడకశిరలో కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. మున్సిపల్ కౌన్సిల్‌లో బలం లేకపోయినా మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టారు. ప్రలోభాలు, దొడ్డిదారిలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకొని ఆ పదవులను దక్కించుకున్నారు. విప్ ధిక్కరించిన వారిపై అనర్హత వేటు వేయాలని వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు ప్రజలు కూడా డిమాండ్ చేస్తున్నారు.

- మడకశిర మున్సిపల్ కౌన్సిల్‌లో బలం లేకపోయినా టీడీపీ అవిశ్వాసం
- ప్రలోభాలతో 9 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకున్న వైనం
- దొడ్డిదారిలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులు
- విప్ ధిక్కరించిన వారిపై అనర్హత వేటు వేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్



ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కండువాలతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

మడకశిర: కూటమి ప్రభుత్వ అరాచకాలు కొనసాగుతున్నాయి. నిస్సిగ్గుగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఎన్నోచోట్ల ఎంపీపీ పదవులతో పాటు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల స్థానాలను అడ్డదారిలో దక్కించుకున్న కూటమి నాయకులు అదే రీతిలో మడకశిరలోనూ అమలు చేశారు. కూటమి నేతల తీరును ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీకి చెందిన మడకశిర మున్సిపల్ చైర్‌పర్సన్, దళితురాలైన లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డిపై కూటమి నాయకులు అవిశ్వాసం తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేయడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై కూటమి నేతలు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది.

ఆరుగురు కౌన్సిలర్ల గైర్హాజరు

మడకశిర మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారిగా పెనుకొండ ఆర్డీఓ ఆనందకుమార్ వ్యవహరించారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి కూడా సమావేశానికి హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. దీనికి మద్దతుగా 14 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కూడా హాజరయ్యారు. దీంతో అవిశ్వాస తీర్మానానికి 15 మంది సభ్యుల మద్దతు లభించింది. ఈ సమావేశానికి ఆరుగురు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు గైర్హాజర్యారు. 20 మంది సభ్యులు ఉన్న మడకశిర మున్సిపల్ కౌన్సిల్‌లో అవిశ్వాస తీర్మానానికి 14 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుడి మద్దతు లభించడంతో అధికారులు అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటించారు.

విప్ ధిక్కరించిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

మడకశిర మున్సిపాలిటీలో మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో 15 మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉన్నారు. టీడీపీకి కేవలం ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. అయితే కూటమి నేతలు ప్రలోభాలకు గురి చేసి 9 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను తమ వైపు లాక్కున్నారు. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో పార్టీ హైకమాండ్ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లందరికీ విప్ జారీ చేసింది. అయితే 9 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు విప్ ధిక్కరించి అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు. విప్ ధిక్కరించిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై అనర్హత వేటు వేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ తరుపున పోటీ చేసి గెలిచిన కౌన్సిలర్లపై ఆయా వార్డుల్లోని ప్రజలు కూడా ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా కోర్టులో శిక్ష తప్పదు



తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేసిన 9 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు ప్రజా కోర్టులో శిక్ష పడడం ఖాయం. పార్టీ విప్ ధిక్కరించి అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకడం అన్యాయం. కూటమి నేతలు అంబేడ్కర్ రాజ్యాంగాన్ని గౌరవించాలి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలో గెలవాలి. అడ్డదారిలో అధికారాన్ని దక్కించుకోవడం చేతగాని తనం. కూటమి నేతలు రెడ్‌బుక్ రాజ్యాంగంతో రెచ్చిపోతున్నారు. వారి అరాచకాలే వారి పతనానికి కారణమవుతాయి. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైంది. ప్రజల్లో కూడా తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుంది. కూటమి నాయకులు ఎన్ని కుట్రలు చేసినా అవి తాత్కాలికమే. భవిష్యత్ వైఎస్సార్‌సీపీదే.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

ముగ్గురు టీడీపీ నాయకుల బైండోవర్

కదిరి టౌన్: పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు తీరుపల్లి మారుతి, పోలినేని శ్రీనివాసులు, కోలా బెనర్జీని తహసీల్దార్ మురళీకృష్ణ వద్ద బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. నల్లచెరువుకు చెందిన షేక్ లతీఫ్ సంతలో పశువులు కొనుగోలు చేసి సేలం, పుంగనూరు, పలమనేరు వంటి సంతలకు తరలిస్తూ వ్యాపారం చేసుకోనేవారు. అయితే ఆ వాహనాలు కదిరి గుండా వెళ్లే సమయంలో కదిరికి చెందిన మారుతి , శ్రీనివాసులు, కోలా బెనర్జీ, అశ్వర్థనాయుడు మరికొందరు పెద్ద మనుషులు పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేసేవారు. దీనిపై బాధితులు పట్టణ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. త్వరలోనే అశ్వర్థనాయుడుతో పాటు విచారణలో తేలిన వారిని కూడా బైండోవర్ చేస్తామని సీఐ తెలిపారు.

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

ప్రశాంతి నిలయం: రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత శుక్రవారం జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని కలెక్టర్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జిల్లాలోని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కాలువను తనిఖీ చేస్తారన్నారు. అనంతరం రోడ్డు మార్గంలో అన్నమయ్య జిల్లాకు బయలుదేరి వెళ్తారన్నారు. మంత్రి సత్యకుమార్ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ముదిగుబ్బ మండలం మలకవేమల క్రాస్ నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ మెయిన్ కెనాల్ పనులను పరిశీలిస్తారన్నారు. మంత్రి సవిత పెనుకొండలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రాజెక్టుల స్థాపనకు భూములు సిద్ధం చేయండి





భూసేకరణ సమీక్షలో పాల్గొన్న అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఇంధన ప్రాజెక్ట్ స్థాపనకు అవసరమైన భూసేకరణకు అనువైన భూములు జాబితాలు సిద్ధం చేయాలని కలెక్టర్ చేతన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంధన ప్రాజెక్ట్‌ల భూసేకరణకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. చేతన్ మాట్లాడుతూ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో 4 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్ట్ స్థాపనకు అవసరమై భూమి సేకరించాల్సి ఉందన్నారు. సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు ఆయా మండలాల్లో ప్రభుత్వ భూమి లభ్యత ఎంత ఉందో వివరాలు సేకరించాలన్నారు. పట్టా ఉన్న రైతులు తమ భూమిని లీజుకు ఇస్తే ఎకరానికి ఏడాదికి రూ.31 వేల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. లీజుకు అంగీకరించే రైతుల భూముల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 20లోపు భూముల జాబితాలు సిద్ధం చేసి జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పరిశీలించాలని చెప్పారు. 22న ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముదిగుబ్బ, తలుపుల, రొద్దం, గుడిబండ, కనగానపల్లి, చిలమత్తూరు, హిందూపురం, అగళి, రామగిరి, మండలాల్లో భూసేకరణ కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, కదిరి, ధర్మవరం, పెనుకొండ ఆర్డీఓలు శర్మ, మహేష్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సర్కార్ సాయం కరువు

- ముందస్తు వర్షాలతో ఖరీఫ్ సాగుకు రైతుల సన్నద్ధం
- సబ్సిడీ విత్తనకాయల కోసం ఎదురుచూపు
- సకాలంలో పంపిణీ చేయాలని వేడుకోలు



ముందస్తు వర్షాలకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతు

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా ముందస్తు వర్షాలు మురిపిస్తున్నాయి. ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. సాగుకు అవసరమైన విత్తన వేరుశనగను ప్రభుత్వం సకాలంలో అందిస్తే రైతులకు ఎంతో ఉపయోగం. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముందుచూపుతో మే 20 నుంచే విత్తనకాయల పంపిణీకి రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టడంతో పాటు అదే నెలలో విత్తనకాయలు అందించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం రైతులను సందిగ్ధంలోకి నెడుతోంది. బోరు బావులున్న రైతులు ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్నా నాణ్యమైన విత్తన కాయలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు.

అందుబాటులో లేని విత్తనం

సాధారణంగా ప్రతి ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వేరుశనగ, కంది, ఉలవలు, అలసంద, పెసర, మినుములు వంటి విత్తనాలను సరఫరా చేస్తుంది. జిల్లాలో ప్రధాన పంటగా వేరుశనగ సాగు చేస్తారు. ఈ రబీలో సాగు చేసిన వేరుశనగ కాయలను అధిక ధరలకు వెచ్చించి ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేసి తరలించేశారు. దీంతో ముందస్తు వర్షాలు కురిసినా వేరుశనగ సాగు చేయడానికి అవసరమైన విత్తనం అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడి సాయం అందేనా?

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఒక్క సంక్షేమ పథకమూ అమలు కాలేదు. దీంతో రైతుల వద్ద చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసే నాటికి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ (రైతు భరోసా) పథకం కింద ఒకే దఫాలో రూ.20 వేలు పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రభుత్వానికి చేరిన నివేదిక

జిల్లాలో ఖరీఫ్–2025లో 2,69,152 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో ఒక్క వేరుశనగ పంట 1,51,824 హెక్టార్లు, కంది 28,925 హెక్టార్లు, మొక్కజొన్న 17,949 హెక్టార్లు, తదితర పంటలు అధికంగా సాగు చేయవచ్చని భావిస్తున్నారు. ఇందుకు తగినట్టుగా వేరుశనగ విత్తన కాయలు 75,895 క్వింటాళ్లు, కంది 1,275 క్వింటాళ్లు, పప్పుశనగ 796 క్వింటాళ్లు, ఉలవలు 300 క్వింటాళ్లు, పెసర, అలసంద వంద క్వింటాళ్లు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు చెప్పారు. అయితే ప్రభుత్వం నుంచి విత్తన కేటాయింపులు, ధర ఖరారు, పంపిణీ తేదీపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వం సకాలంలో విత్తనకాయలు అందిస్తే సరి.. లేకుంటే బహిరంగ మార్కెట్లో ఆకాశాన్నంటుతున్న ధరలతో విత్తనాలు కొని పంటలు సాగు చేయడం కష్టమవుతుందని రైతులు అంటున్నారు. సబ్సిడీ విత్తన పంపిణీపై త్వరగా స్పందించాలని కోరుతున్నారు.

మధుర ఫలం.. విషతుల్యం

- ప్రమాదకర రసాయనంతో మామిడిని మాగబెడుతున్న వ్యాపారులు
- వర్షాలు కురిసిన నేపథ్యంలో మామిడి కొనుగోలుకు ఎగబడుతున్న ప్రజలు
- కొనుగోలు సమయంలో నాణ్యతపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న నిపుణులు



హిందూపురంలో రసాయనాలతో మాగేసిన మామిడి పండ్లను విక్రయానికి పెట్టిన దృశ్యం



మామిడిని మాగబెట్టేందుకు విషపూరిత రసాయనిక ద్రావకం పిచికారీ చేస్తున్న వ్యాపారి



మామిడిని మాగబెట్టేందుకు వినియోగిస్తున్న ప్రమాదకర కాల్షియం

హిందూపురం: మామిడికి ఇప్పుడిప్పుడే మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. ఇంత కాలం ఎండల తీవ్రత కారణంగా మామిడిని కొనుగోలు చేసేందుకు ప్రజలు భయపడుతూ వచ్చారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో మార్కెట్‌లో మామిడి కొనుగోలు దారుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇలాంటి తరుణంలో వ్యాపారులు సహజ సిద్ధంగా కాకుండా ప్రమాదకర కాల్షియం కార్బైడ్‌తో మాగిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

దిగుబడి సైతం మోస్తారుగానే

ఈ ఏడాది మామిడి దిగుబడులు ఓ మోస్తరుగా ఉన్నాయని ఉద్యాన శాఖ అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఆపరేషన్ సిందూర్ ప్రభావం కారణంగా ఎగుమతులపై ప్రభావం పడింది. దీంతో స్థానికంగానే మార్కెట్‌లో మామిడి విస్తృతంగా అందుబాటులోకి వచ్చింది. అయితే ఎండలు తీవ్ర ప్రభావం చూపుతుండడంతో ఇంత కాలం మామిడి కొనుగోలు చేసేందుకు పలువురు వెనుకంజ వేస్తూ వచ్చారు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మార్కెట్‌లో మామిడికి డిమాండ్ నెలకొంది. ఈ నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా మామిడిని అందుబాటులో ఉంచేందుకు వ్యాపారులు అడ్డదారులు తొక్కడం మొదలు పెట్టారు. పెనుగాలులు, వర్షాలకు నేలరాలిన కాయలను తక్కువ ధరకే వ్యాపారులు కొనుగోలు చేసి త్వరగా పక్వానికి వచ్చేలా విషపూరిత కాల్షియం కార్బైడ్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నట్లుగా సమాచారం. వీటిని తిన్న వృద్ధులు, చిన్నారులు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

నాణ్యతను గుర్తించండి ఇలా..

- సహజ సిద్ధంగా మాగిన మామిడి మొత్తం ఒకే రంగులో ఉండదు. పండిన వాసనతో కోసినప్పుడు లోపలి భాగం మొత్తం ఒకే రకమైన పక్వత కనిపిస్తుంది.
- ప్రమాదకర రసాయనంతో మాగేసిన పండ్లు మొత్తం ఒకే రంగులో ఉంటాయి. కోసినప్పుడు లోపలి భాగం చుట్టూ కొద్ది పక్వత కలిగి, మిగిలిన భాగం అపరిపక్వంగా ఉంటాయి.
- ఇథిలీన్ వాయివుతో చాంబర్‌లో మాగిన పండ్లు ఆరోగ్యానికి మంచిది. ఇవి సహజ పరిపక్వతకు దగ్గరగా ఉంటాయి.
- మామిడిని కొళాయి నుంచి వదిలే నీటిలో మూడు నిమిషాలు ఉంచి శుభ్రం చేసిన తర్వాత తొక్కను తీసి తినాలి.

నాణ్యత ఉన్న వాటినే కొనుగోలు చేయండి



మామిడిని సహజ సిద్ధంగా పండించాలి. రసాయనాలతో మాగించిన పండ్ల తొక్క ముడతలు లేకుండా గట్టిగా ఉంటుంది. ఇలాంటి పండ్లు ప్రమాదకరం. పండ్లను ముందుగా ఉప్పు కలిపిన నీటిలో 15 నుంచి 20 నిముషాలు ఉంచి తిరిగి వాటిని మంచినీటిలో కడిగి తడి లేకుండా తుడిచిన తర్వాత తినాలి. సాధ్యమైనంత వరకు పండ్ల తొక్కను తీసి తినడం మంచిది.

– మహేష్, ఉద్యానాధికారి, హిందూపురం

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా.. పలువురికి గాయాలు



చెల్లాచెదురుగా పడిన ఇటుకలు

హిందూపురం: స్థానిక ఇందిరమ్మ కాలనీ సమీపంలోని జాతీయ రహదారిలో గురువారం ఉదయం ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడింది. అధిక లోడు కారణంగా వేగంగా వెళుతున్న సమయంలో కుదుపులకు బోల్తాపడడంతో ట్రాలీపై ఉన్న ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో గాయపడిన వారిలో కిష్టప్పకు కాళ్లకు బలమైన గాయలు కావడంతో చికిత్సలు అందిస్తున్నారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దాడి కేసులో ఐదుగురికి జరిమానా

రొద్దం: వ్యక్తిపై దాడి చేసిన ఐదుగురికి జరిమానా విధిస్తూ పెనుకొండ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బొజ్జప్ప గురువారం తీర్పు వెలువరించారు. ఈ మేరకు ఎస్ఐ నరేంద్ర గురువారం వెల్లడించారు. రొద్దం మండలం రాచూరు గ్రామానికి చెందిన కురుబ అంజినరెడ్డి కుమార్తెను 2014లో రామగిరి మండలం కనివాండ్లపల్లి గ్రామానికి చెందిన కురుబ శివశంకర్ పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో ప్రసవానికి పుట్టింటికి వెళ్లిన భార్యను పలకరించేందుకు తరచూ రాచూరుకు శివకుమార్ వచ్చివెళ్లేవాడు. ఓ రోజు తన అత్త సుశీలమ్మతో ఇంటి బయట మాట్లాడుతున్న శివశంకర్‌పై రాచూరు గ్రామానికి చెందిన గొల్ల ధనుంజయ, రవి, సుధాకర్, పరంధామ, బోయ శ్రీరాములు దాడి చేసి గాయపరిచారు. ఘటనకు సంబంధించి 2015లో అప్పటి ఎస్ఐ దస్తగిరి కేసు నమోదు చేసి, ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.6 వేలు చొప్పున జరిమానా, జరిమానా కట్టని పక్షంలో ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ శ్యామల వాదనలు వినిపించారు.

డీఏజేజీయూఏ కింద మూడు తండాల ఎంపిక

ప్రశాంతి నిలయం: గిరిజన సమాజాభివృద్ధికి ధర్తీ ఆబా జంజాటియా గ్రామ ఉత్కర్ష అభియాన్ (డీఏజేజీయూఏ) కింద జిల్లాలో మూడు తండాలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సమాజ అభివృద్ధిని నిర్ధారించడానికి 17 శాఖల కలయిక ద్వారా 25 అంశాలపై దృష్టి పెడుతోందన్నారు. ఈ పథకం దేశంలోని 26 రాష్ట్రాల్లో, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లో గిరిజనుల సంక్షేమాభివృద్ధికి దోహద పడనుందని పేర్కొన్నారు. జిల్లాలోని సోమందేపల్లి మండలంలోని నాగేనాయుని చెరువు తండా, తనకల్లు మండలం ముండ్లవారిపల్లి తండా, గాండ్లపెంట మండలంలోని తుమ్మల బైలు తండాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా సురక్షిత తాగునీరు, గృహ నిర్మాణం, మెరుగైన పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణపై ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్



డయాలసిస్ యూనిట్‌లో రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్

హిందూపురం టౌన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నట్లు డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ తెలిపారు. స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులు, ఓపీ విభాగం, ఫార్మసీ, డయాలసిస్ యూనిట్‌తో పాటు నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన సముదాయాన్ని పరిశీలించారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. శిథిలావస్థకు చేరుకున్న మార్చురీని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో వైద్యులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. వైద్యులకు అవసరమైన పరికరాలు, మెరుగైన వైద్య సేవలు అందించడానికి కావాల్సిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ యూనిట్‌లో ఏసీలు పనిచేయకపోవడంతో రోగులు పడుతున్న ఇబ్బందులు గమనించి అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల్లో ఏసీలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

5 నెలల్లో అందుబాటులోకి క్రిటికల్ కేర్ యూనిట్

ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో పలు రకాల వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మరో ఐదు నెలల్లో ఈ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. తద్వారా మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించవచ్చునన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించినట్లు పేర్కొన్నారు. చిన్నారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్యం అందించడంతో పాటు వార్డుల్లో ఇన్‌పేషంట్ సేవలు మరింత పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్పత్రిలో అందించే ప్రతి చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ కింద నమోదు చేయాలని వైద్యులను ఆదేశించినట్లు తెలిపారు. వైద్యుల ఖాళీలను భర్తీ చేసేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. అలాగే నెల రోజుల్లోపు ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఫార్మసీలో అన్ని మందులను అందుబాటులోకి తీసుకు వచ్చామని, ముఖ్యంగా గుండె నొప్పితో బాధపడేవారు ఆసుపత్రిలో స్టేమీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక మార్చురీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సీఎస్ఆర్ ఫండ్స్ కింద ఆస్పత్రికి అవసరమైన పరికరాలను కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆస్పత్రిలో డీ–అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి, నియామకాలు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం వెలికితీత

రాయదుర్గం టౌన్: స్థానిక దుగ్గిలమ్మ గుడి కోనేరులో స్నేహితులతో కలసి ఈతకు వెళ్లి గల్లంతైన బోయ రాజశేఖర్ (30) రెండో రోజు గురువారం మృతదేహమై నీటిలో తేలియాడుతూ కనిపించాడు. ఈత రాకపోయినా స్నేహితుల ఒత్తిళ్ల కారణంగా బుధవారం బావిలో దిగి గల్లంతైన విషయం తెలిసిందే. బుధవారం మధ్యాహ్నం నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. గురువారం తెల్లవారుజాము నుంచి నాలుగు భారీ స్థాయి ఆయిల్ మోటార్లతో బావిలో నీటిని బయటకు తోడేయడంతో రాత్రి 8.30 గంటలకు రాజశేఖర్ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎస్‌బీఐకి వినియోగదారుల ఫోరం వడ్డింపు

అనంతపురం: ''ఖాతాదారుడికి తెలియకుండా లావాదేవీలు జరిగితే అందుకు బ్యాంకుదే బాధ్యత. లావాదేవీల మెసేజ్ పంపకపోవడం బ్యాంకు సేవా లోపంగా పరిగణించాల్సిందే'' అని అనంతపురం జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలత అన్నారు. ఖాతాదారు ప్రమేయం లేకుండా ఖాతా నుంచి విత్‌డ్రా అయిన మొత్తాన్ని ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తిరిగి చెల్లించాలని ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురానికి చెందిన ఎన్. సునీత డాక్టర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆమె బ్యాంకు ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మే 2023లో ఆధార్ గుర్తింపు ఆధారిత పేమెంట్ వ్యవస్థ (ఏఈపీఎస్) ద్వారా ఐదు విడతలుగా రూ.40,200 విత్‌డ్రా చేశారు. దీంతో ఆమె ఆ మరుసటి రోజే (మే 24, 2023) బ్యాంక్ మేనేజర్‌తో పాటు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. 15 రోజుల్లో తిరిగి జమ చేస్తామని చెప్పిన బ్యాంకు అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. దీంతో సునీత వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసును గురువారం జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలత, సభ్యుడు బి. గోపీనాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కమిషన్ నోటీసులు అందుకున్న ఎస్‌బీఐ అధికారులు కూడా కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఆధార్ గుర్తింపు ఆధారిత పేమెంట్ విధానంలో వేలిముద్ర గుర్తింపు ఉపయోగించి ఐదు విడతల్లో రూ.40,200 నగదు డ్రా చేశారని , ఇందుకు తాము బాధ్యత వహించబోమని తమ వాదన వినిపించారు. ప్రతి లావాదేవీకి మొబైల్‌కు మెసేజ్ కూడా పంపినట్లు తెలిపారు. అయితే, కమిషన్ పరిశీలనలో ఈ అంశం నిరూపణ కాలేదు. ఆర్‌బీఐ 2017లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖాతాదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జరిగిన లావాదేవీలకు బ్యాంకు బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషన్ చైర్‌పర్సన్ అన్నారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని సునీత ఖాతా నుంచి అనధికారికంగా విత్‌డ్రా అయిన రూ.40,200 మొత్తానికి 6 శాతం వడ్డీతో ఈ నెల 23వ తేదీలోపు చెల్లించాలని తీర్పు వెలువరించారు. అలాగే సేవా లోపానికి రూ.10 వేలు, ప్రయాణ ఖర్చులకు మరో రూ.5 వేలు మొత్తంగా 45 రోజుల్లో చెల్లించాలని ఆదేశించారు.

పాఠశాల విద్య నిర్వీర్యం

- ఏపీ ఎస్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు

పెనుకొండ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అశాస్త్రీయ నిర్ణయాలతో పాఠశాల విద్య నిర్వీర్యమవుతోందని ఏపీ ఎస్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తొమ్మిది రకాల పాఠశాలల పేరుతో ఒక్కో పాఠశాలకు ఒక్కో నిబంధన విధించి ఉపాధ్యాయులను కేటాయించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో కొన్ని వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి విద్యార్థుల భవిష్యత్ అంధకారం కానుందన్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందించాలంటే అన్ని పాఠశాలలకు ఒకే రకమైన స్టాఫ్ ప్యాట్రన్ ఉండాలని డిమాండ్ చేసారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం





విశేష అలంకరణలో మూలవిరాట్, గరుడ వాహనంపై విహరిస్తున్న లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ రూరల్: ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. ప్రధాన అర్చకుడు ద్వారకనాథచార్యులు, ఈఓ సాకే రమేష్‌బాబు అధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపించారు. అంతకు ముందు దేవేరులతో కలసి గరుడ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి



నవీన్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అమరాపురం: మండలంలోని ఉదుగూరు – కాచికుంట గ్రామాల మధ్య చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుడిబండ మండలం గుడ్డదహళ్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ (43) అమరాపురం మండలం కెంకెర గ్రామానికి చెందిన మహిళను పెళ్లి చేసుకున్నాడు. గురువారం వ్యక్తిగత పనిపై అమరాపురం గ్రామానికి వెళ్లిన ఆయన పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై కెంకర గ్రామానికి బయలుదేరాడు. ఉదుగూరు – కాచికుంట గ్రామాల మధ్య ప్రయాణిస్తుండగా.. ద్విచక్ర వాహనం అదుపు తప్పి మోరీని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లాలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ మేరకు నక్కారామారావు ఎడ్యుకేషనల్, కల్చరల్ ట్రస్ట్ బోర్డు, యాదవ సంఘం, యాదవ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆయా సంఘాల ప్రతినిధులు జి.నాగభూషణం, జి.శ్రీనివాసులు, బి.రామకృష్ణ, ఎం.శ్రీరాములు, ఉమాశంకర్, హేమంత్, లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతిలో 400పైబడి మార్కులు, ఇంటర్‌లో 700పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు. జూన్ 1న పురస్కారాలు అందజేయనున్నారు. మరింత సమాచారానికి 83094 75846, 94922 87710లో సంప్రదించవచ్చు.

వీరజవాన్ కుటుంబ సభ్యులకు పరామర్శ



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శివారెడ్డి

గోరంట్ల: వీరజవాన్ మురళీనాయక్ కుటుంబసభ్యులను ప్రముఖ నటుడు శివారెడ్డి పరామర్శించారు. గురువారం కల్లితండాకు చేరుకున్న ఆయన మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మురళీనాయక్ తల్లి జ్యోతిబాయిని పరామర్శించారు. మురళీనాయక్ త్యాగం మరువలేనిదని కొనియాడారు. అనంతరం ప్రముఖ ఆర్టిస్ట్ వాసు గీచిన మురళీనాయక్ చిత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక సర్పంచ్ వాసునాయక్ ఉన్నారు.

కారు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న కారు

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల గ్రామ సమీపంలో మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. వెనిల్ అనే వ్యక్తితో కలసి మరో వ్యక్తి అనంతపురం నుంచి కారులో ధర్మవరానికి బయలుదేరాడు. చిగిచెర్ల సమీపంలోకి చేరుకోగానే ఒక్కసారిగా కారులో నుంచి పొగలు రాసాగాయి. గమనించిన వారు కారు ఆపి కిందకు దిగారు. అప్పటికే మంటలు ఎగిసిపడ్డాయి. మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'కియా'కు సమ్మె నోటీసు



కియా పరిశ్రమ వద్ద సమ్మె నోటీసులు అతికిస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: దేశ వ్యాప్తంగా ఈ నెల 20 తేదీన చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. కియా కార్మికులు కూడా సమ్మెలో పాల్గొనేలా కియా పరిశ్రమకు నోటీసులు అతికించారు. నాయకులు మాట్లాడుతు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్‌లుగా బిల్లు తీసుకొచ్చిందన్నారు. కార్మికుల కష్టాన్ని పెట్టుబడి దారులకు దోచిపెట్టేందుకే లేబర్ కోడ్లను తీసుకొచ్చారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయి కొనుగోలు శక్తి తగ్గిందన్నారు. సమ్మె విజయవంతానికి అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హరి, బాబావలి, సాంబ శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.